ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 22 మార్చి 2025



గందరగోళం..!



పరిషత్‌లో పోడియం వద్ద నినాదాలు చేస్తున్న సభ్యులు

- చివరిరోజు అట్టుడికిన సభలు
- శాసనసభలో హనీట్రాప్ వివాదం
- స్పీకర్‌పై పేపర్లు విసిరిన బీజేపీ సభ్యులు
- 18 మందిపై సస్పెన్షన్ వేటు
- పరిషత్‌లో పుట్టణ్ణ వ్యాఖ్యలపై వాగ్వాదం
- ఉభయసభలు నిరవధిక వాయిదా

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభ చివరిరోజు సమావేశాలు అట్టుడికిపోయాయి. ఇటు అసెంబ్లీలో, అటు పరిషత్‌లోనూ తీవ్రదుమారం రేపాయి. బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాల చివరిరోజు పరిషత్‌లో బీజేపీ సభ్యుడు సీటీ రవి, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పట్ల అనుచితంగా మాట్లాడారనే వివాదం తారస్థాయికి చేరి సంచలనమైన రీతిలోనే రాష్ట్ర శాసనసభ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఏకంగా 18మంది బీజేపీ సభ్యులపై వేటుపడింది. శుక్రవారం కలాపాలు ప్రారంభం కాగానే బడ్జెట్‌పై కొందరు సభ్యులు మాట్లాడేందుకు అవకాశం ఉందని స్పీకర్ ప్రకటించారు. గురువారం అవకాశం దక్కనివారు బీజేపీ సీనియర్ సభ్యుడు బసనగౌడపాటిల్ యత్నాళ్‌కు మాట్లాడాలని స్పీకర్ సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఒక మతానికి రిజర్వేషన్ కల్పించే విధానం రాజ్యాంగంలో లేదని యత్నాళ్ తెలిపారు. మైనారిటీలకు కాంట్రాక్టు పనులలో 4శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇలా మాట్లాడుతుండగానే ఆయనకు ఓ చీటీ వచ్చింది. దీంతో గురువారం సభలో మంత్రి రాజణ్ణ అతడికి ఎదురైన హనీట్రాప్ వివాదం తెలిపారని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సభ గందరగోళం కావడంతో స్పీకర్ వాయిదా వేశారు. మరోసారి సభ ప్రారంభం కాగా బడ్జెట్‌పై వివరణ ఇవ్వాలని సీఎంను స్పీకర్ కోరారు. అంతలోనే బీజేపీ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్పీకర్ పోడియం చెంతకు వెళ్లి పలువురు సభ్యులు స్పీకర్‌పై కాగితాలను విసిరారు. పలుమార్లు మార్షల్స్ అడ్డుకునేందుకు ప్రయత్నించినా కొందరు సభ్యులు దూసుకెళ్లారు. దీంతో స్పీకర్‌కు రక్షణా కవచంగా మార్షల్స్ నిలిచారు. మరోవైపు సీఎం సిద్దరామయ్యకు మంత్రి బైరతి సురేశ్‌తోపాటు పలువురు సభ్యులు కవచంగా నిలిచారు. ఇలా సాగుతుండగానే బీజేపీ సభ్యులు హనీట్రాప్‌ఎలో 48మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని, సీబీఐ లేదా జ్యుడీషియల్ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అంతలోనే డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ హనీట్రాప్ అనేది హలో అంటేనే మాట్లాడి ఉంటారని, పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. దీంతో సభలో తీవ్రమైన గందరగోళానికి కారణం కాగా స్పీకర్ వాయిదా వేశారు. స్పీకర్ చాంబర్‌లో సీఎం సహా పలువురు సభలో జరిగిన గందరగోళంపై చర్చించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కారాదని అభిప్రాయపడ్డారు. అనుచితంగా ప్రవర్తించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని తీర్మానించారు. మరోసారి సభ ప్రారంభం కాగానే స్పీకర్ యూటీ ఖాదర్ మాట్లాడుతూ స్పీకర్ పదవికి అవమానం చేసినవారిని ఉపేక్షించేది లేదన్నారు. 18మంది బీజేపీ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు.

వేటుపడిన సభ్యులు వీరే...

వేటుపడిన సభ్యులలో మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి బైరతి బసవరాజ్, సభ్యులు దొడ్డనగౌడ పాటిల్, శైలేంద్ర బెల్దాళ, మునిరత్న, ధీరజ్ మునిరాజు, బీపీ హరీశ్, డాక్టర్ భరత్‌శెట్టి, చంద్రు లమాణి, ఉమానాథ కోట్యాన్, సీకే రామమూర్తి, యశ్‌పాల్ సువర్ణ, సురేశ్‌గౌడ, శరణు సలగ, చన్నబసప్ప బసవరాజ్ ముత్తిమోడ, ఎస్ఆర్ విశ్వనాథ్, ఎంఆర్ పాటిల్ ఉన్నారు. వీరికి ఆరు నెలలపాటు స్థాయి కమిటీ సభలకు వేటు వర్తిస్తుందని స్పీకర్ ప్రకటించారు. వేటుపడిన సభ్యులు నినాదాలు చేస్తుండగా మార్షల్స్ ప్రవేశించి ఒక్కొక్కరిని బయటకు ఎత్తుకెళ్లారు. గందరగోళం మధ్యనే బడ్జెట్‌పై సీఎం వివరణ కొనసాగింది. దీంతో కలాపాలను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ ప్రకటించారు.

రాజ్‌భవన్‌కు బీజేపీ సభ్యులు

18మంది బీజేపీ ఎమ్మెల్యేలపై వేటు వేయడంపై బీజేపీ-జేడీఎస్ సభ్యులు రాజ్‌భవన్‌కు ఫిర్యాదు చేశారు. కలాపాలు వాయిదా పడగానే సభ్యులంతా రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అందుబాటులో లేకపోవడంతో గవర్నర్ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ సభ్యులు అహంకారం ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపించారు.

పరిషత్‌లోనూ అదే తీరు..

పరిషత్ కలాపాలు ప్రారంభం కాగానే బడ్జెట్‌పై సభ్యులు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ఇలా కాంగ్రెస్ సభ్యుడు సుధామదాస్ మాట్లాడుతుండగా మరో సభ్యుడు పుట్టణ్ణ కొన్ని అంశాలు ప్రస్తావించారు. బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పుట్టణ్ణ ఆవేశంలో ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామిని ఉద్దేశించి అనుచితంగా మాట్లాడారంటూ బీజేపీ-జేడీఎస్ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఒకానొకదశలో సభాపతి హొరట్టి ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత రికార్డులను పరిశీలించారు. పుట్టణ్ణ అనుచిత వ్యాఖ్యలు ఉండడంతో తొలగిస్తామన్నారు. కానీ ఆ సభ్యుడు పనిగట్టుకుని అనుచితంగా మాట్లాడుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా కలాపాలను కాసేపు వాయిదా వేశారు. మరోసారి మధ్యాహ్నం 1 గంట తర్వాత సభ ప్రారంభం కాగా అదే వివాదం కొనసాగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగింది. కాంగ్రెస్ సభ్యుడు పుట్టణ్ణను సభనుంచి బయటకు పంపాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. అలా పంపేందుకు నిబంధనలు ఉండవని, రాతపూర్వకంగా వినతి ఇస్తే పరిశీలిస్తానని సభాపతి తెలిపారు. గందరగోళం కొనసాగుతుండడంతో మధ్యాహ్నం 2.45 గంటలకు కలాపాలను వాయిదా వేశారు. 3 గంటలకు సీఎం బడ్జెట్‌పై వివరణ ఇస్తారన్నారు. సభలో సీఎం ఉన్నా ప్రతిపక్షాల నిరసన కొనసాగింది. అంతలోనే సీఎం బడ్జెట్‌పై కాసేపు మాట్లాడగా కలాపాలను వాయిదా వేస్తున్నట్టు సభాపతి ప్రకటించారు.



సస్పెండైన సభ్యులను తరలిస్తున్న మార్షల్స్

పదవికి రాజీనామా చేస్తా ..!

- ఇంత దారుణం ఎన్నడూ చూడలేదు
- స్పీకర్‌కు గౌరవం ఇవ్వని బీజేపీ నాయకులు
- సభకు భంగం కలిగించడం దారుణం
- ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఆవేదన



బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శాసనసభలో గందరగోళాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు బీఆర్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభలో గందరగోళం కొనసాగుతుండగానే స్పీకర్‌పై బీజేపీ సభ్యులు కాగితాలు విసిరారు. దీంతో స్పీకర్ పదినిమిషాలపాటు సభను వాయిదా వేశారు. ఇదే సమయంలోనే శాసనసభ నుంచి మీడియాపాయింట్‌కు వచ్చిన ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మాట్లాడుతూ రాజీనామా చేస్తానన్నారు. సభలో ఇటువంటి గందరగోళ పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. స్పీకర్‌పై పేపర్లు వేయడం సరికాదన్నారు. ఇదే విషయమై సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ బీఆర్ పాటిల్ తనకు మిత్రుడని, ఆయనతో పిలిపించి మాట్లాడుతానన్నారు. కాగా బీఆర్ పాటిల్ కాంగ్రెస్ సీనియర్ నేత కలబురగి జిల్లా అళంద నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలలకే పలువురి మంత్రుల తీరును తప్పుబట్టి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. మరోసారి సీనియర్లంటే గౌరవం లేకుండా పోతోందని, హోదాలో ఉండదలచుకోలేదన్నారు. దీంతో ఆయనకు సీఎం రాజకీయ సలహాదారుడి హోదాను గత ఏడాది కల్పించారు. ఇటీవలే ఆ హోదా వలన కూడా ప్రత్యేకత ఏదీ లేదని తిరగబడ్డారు. దీంతో మరోసారి బీఆర్ పాటిల్‌కు సలహాదారుడి నుంచి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా కేబినెట్ హోదా కల్పించారు.

బీజేపీ సంస్కృతి లేని పార్టీ: డీకే



బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్కృతి లేని పార్టీ అని డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. అత్యాచారానికి పాల్పడి కోర్టులలో స్టే తెచ్చుకున్న ముంబై బాయ్స్ ఆ పార్టీలోనే ఉన్నారన్నారు. శాసనసభలో గూండాల్లా వ్యవహరించారన్నారు. విధానసౌధ ప్రాంగణంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ హనీట్రాప్‌పై ఫిర్యాదు చేస్తే సమగ్ర విచారణలు జరిపిస్తామన్నారు.

పుట్టణ్ణపై చర్యలకు ప్రతిపక్షాల పట్టు

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సభ్యుడు పుట్టణ్ణపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సభ్యులు పట్టుబట్టడంతో పరిషత్ కలాపాలు శుక్రవారం రెండుసార్లు వాయిదా పడ్డాయి. ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామిని ఉద్దేశించి 'మీ తండ్రి అంటూ' మాట్లాడారని ఆందోళన ప్రారంభమైంది. కాంగ్రెస్ సభ్యుడు మాట్లాడుతుండగా ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. ఇదే సమయంలోనే కాంగ్రెస్ సభ్యుడు పుట్టణ్ణ వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. అంతలోనే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో రికార్డుల పరిశీలనలో పుట్టణ్ణ వ్యాఖ్యలు ఉన్నట్టు తేలింది. ఈమేరకు వాటిని రికార్డులనుంచి తొలగిస్తామని సభాపతి తెలిపారు. అయితే అనుచితంగా మాట్లాడడం తప్పు అని, అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లి ఆందోళన చేశారు. సభ గందరగోళంగా ఉండడంతో సభాపతి పదినిమిషాలపాటు వాయిదా వేశారు. అరగంట తర్వాత సమావేశాలు ప్రారంభమైనా గందరగోళ పరిస్థితి కొనసాగింది. సభ్యుడు పుట్టణ్ణ మాట్లాడుతూ తాను తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని, అలా నిరూపిస్తే ఎంతటి చర్యలకైనా సిద్ధమన్నారు. కానీ ప్రతిపక్ష సభ్యులు మాత్రం పుట్టణ్ణపై వేటు వేయాలని, లేదంటే మాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభాపతి బసవరాజహొరట్టి పలుమార్లు కలాపాల చివరిరోజు మరింతమంది సభ్యులు మాట్లాడాల్సి ఉందని సూచించారు. అయితే పరిస్థితిలో మాత్రం మార్పు రాకపోవడంతో 2.45 గంటలకు కలాపాలను వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత సమావేశం ప్రారంభం కాగానే సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అంతలోనే సభ్యులు హనీట్రాప్‌పై సీఎం వివరణ ఇవ్వాలని డిమాడ్ చేశారు. గందరగోళంలోనూ సీఎం బడ్జెట్‌పై వివరణ ఇచ్చారు.



విద్యార్థులకు గులాబీలు ఇచ్చి అభినందిస్తున్న మంత్రి మధు బంగారప్ప

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు ప్రారంభం

- ఎండ వేడిమికి ప్రతి పాఠశాలలో ఓఆర్ఎస్, తాగునీరు ఏర్పాటు చేసిన అధికారులు

వైభవంగా కావేరీ హారతి

7



కావేరీపై సాంస్కృతిక కార్యక్రమాలు, హారతి ఇస్తున్న డీసీఎం డీకే



నేడు రాష్ట్ర బంద్

7లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.47 (శనివారం సాయంత్రం)

సెహరీ : 5.10 (ఆదివారం ఉదయం)



ఆరా..!







- ఆన్‌లైన్ గేమ్‌లకు బలవుతున్న యువత
- ఐదు నెలల్లో 16మంది ఆత్మహత్య
- లక్షల్లో అప్పులు... తీర్చే మార్గం లేక బలవన్మరణం

బెంగళూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఆటలకు యువత బలవుతున్నాడు. రూ.లక్షల్లో అప్పులు చేసి, తీర్చే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు జూదాలంటే పేకాట లేదా కోడిపందేలు, పల్లెప్రాంతాల్లో నాణేలు తిప్పే ఆటలు ఉండేవి. ఆ తర్వాత పేకాట క్లబ్‌లు వచ్చాయి. ఇటీవల కేసినో వంటి ఆటలు వచ్చాయి. అవి కూడా ఎదుటిమనిషి ఆడిస్తుండగా గెలవాలనే లక్ష్యంతో బెట్టింగ్ కాసేవారు. కానీ ఆధునికమైన డిజిటలీకరణ ద్వారా ఎంత వేగవంతంగా సౌలభ్యాలు అందుతున్నాయో అంతకంటే వేగంగానే అనర్థాలు దెబ్బకొడుతున్నాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ వచ్చేసింది. అందులోనే పల్లె నుంచి ప్రపంచందాకా సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఏం కావాలన్నా క్షణాలలో బుక్ చేసుకునే సౌకర్యం వచ్చింది. వీటన్నింటికంటే సులభతరంగా డబ్బును ఇచ్చి పుచ్చుకునే ప్రక్రియ కూడా సాగుతోంది. ఇలాంటి వారికోసమే ఆన్‌లైన్ గేమ్‌లు కూడా వచ్చేశాయి. మొబైల్ ఉంటే చాలు పక్కన మరో వ్యక్తి ప్రమేయం గానీ, సలహాలు లేకుండాగానీ ఆహ్లాదకరంగా ఆడుకోవచ్చు. అది కాస్త కొందరికి వ్యసనంగా మారింది. ఒకసారి డబ్బులు రాగానే అదే దారిలో సంపాదించాలనే ఆలోచనే కొంప ముంచుతోంది.

ఆటలో బలవుతోంది యువకులే..

ఆన్‌లైన్ ఆటల్లో బలవుతోంది అధికంగా యువకులే కావడం విషాదకరం. అధికంగా 20-35ఏళ్ల వయసున్నవారే ఉన్నారు. పోలీసుల సమాచారం మేరకు 16మంది ఉన్నారంటే అంతకుమించి కూడా సంఘటనలు చోటు చేసుకుని ఉంటాయి. ఆత్మహత్యకు పాల్పడినవారిలో ఒక్కొక్కరిది హృదయవిదారకర సంఘటనలుగా ఉన్నాయి.

- బెంగళూరులో ఓ విద్యార్థి తల్లిదండ్రులు కళాశాల ఫీజు కట్టేందుకు ఇచ్చిన సొమ్ము ఆన్‌లైన్‌లో పోగొట్టుకుని, ఇంట్లో చెప్పలేక బలవన్మరణం పాలయ్యాడు.
- కలబురగి జిల్లా భాల్కి తాలూకాలో సోమనాథ్ సతీశ్‌కుమార్ చిద్రె (22) ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డాడు.
- కలబురగిలోని మెడికల్ కళాశాలలో బీఎస్‌సీ నర్సింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. కుమారుడు చేసిన అప్పులు తీర్చేందుకు కుటుంబసభ్యులు భూమిని అమ్మి రూ.80లక్షలు సమకూర్చారు. అయినా హాస్టల్‌లోనే విద్యార్థి సోమనాథ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- బీదర్ యువకుడు రూ.12లక్షలు అప్పు చేసి తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- ఉద్యోగం కోసం అంటూ లక్షల రూపాయలు కుటుంబీకులనుంచి తీసుకుని ఆన్‌లైన్ గేమ్‌లో కోల్పోయి ధారవాడకు యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.
- బెట్టింగ్ వ్యసనంగా మారి రూ.80లక్షలు అప్పు చేసి మైసూరులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- బీదర్‌కు చెందిన విజయకుమార్ జగన్నాథహాళ్ళ (24) బి-ఫార్మసీ చదివాడు. గేమ్‌లకోసం రూ.12లక్షలు అప్పు చేశాడు. ఆత్మహత్యకు ముందు మరెవ్వరూ ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కారాదని డెత్‌నోట్‌లో పేర్కొంటూ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- బెంగళూరు కేఆర్‌పురంనకు చెందిన ప్రవీణ్‌సింగ్ (20) పీయూను అర్థాంతరంగా ఆపేసి గేమ్‌లకు బానిసగా మారి చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు.



సరదాగా ప్రారంభం.. వ్యసనంగా మారుతున్నాయి..

సరదా ఆటల పేరుతో ప్రారంభమయ్యే ఆన్‌లైన్ గేమ్‌లు వ్యసనంగా మారాయి. ఒకటి రెండుసార్లు బెట్టింగ్‌లతో కాసిన్ని పైసలు మొబైల్ ఖాతాలో పడితే చాలు... ఇక ఎప్పుడూ ఇలాగే వస్తాయని బానిసలుగా మారిపోతున్నారు. ఇలా ఆన్‌లైన్ గేమ్‌లకు పట్టణ ప్రాంతాల్లో యువత, పల్లె ప్రాంతాలలో వివిధ వర్గాలకు చెందినవారికి బలయిపోతున్నారు. రాష్ట్రంలో ఐదు నెలల్లో ఏకంగా 16మంది ఆన్‌లైన్ గేమ్‌లతో అసువులు బాశారు. ఇలా 16 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అతడు ఎప్పుడు గేమ్‌లు ఆడేవాడు, లక్షలాది రూపాయలు ఎలా అప్పులు ఇచ్చారు, ఇంతకూ అతడు ఏ విధమైన పూచీకత్తు పెట్టారనేది అంతుచిక్కని విషయంగా ఉంటుంది. ఆన్‌లైన్ గేమ్‌లతో ఆత్మహత్యలకు పాల్పడిన అందరి జీవితం విషాదంగా ముగిసింది.

ఆన్‌లైన్ ఆటలను ప్రోత్సహిస్తున్న నటీనటులు..!

సినిమా నటులను అందరూ ఆదర్శంగా తీసుకుంటారు. సినిమాల ద్వారా ఓ మంచి సందేశం ఇస్తారనే విధానం ఉండేది. అందుకే హీరోలు, హీరోయిన్‌లను తమ మార్గదర్శకులుగా భావిస్తారు. అయితే ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా సమాజానికి నష్టంగా ఉన్నా నటీనటులు వ్యాపార ప్రకటనలు పాల్గొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమ్‌లకు రాయబారులుగా వ్యవహరించిన నటులపై కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో కూడా అలాంటి కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆన్‌లైన్ జూదాలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి నైపుణ్యత అవసరమైన గేమ్‌లు (స్కిల్ బేస్డ్ గేమ్స్), రెండోది అదృష్టంపై ఆధారపడిన గేమ్‌లు. దేశవ్యాప్తంగా అదృష్టంపై ఆధారపడిన గేమ్‌లనే యువత ఎక్కువగా ఆడుతుంటారు. రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమ్ బెట్టింగ్‌ల దారుణాలు నిరంతరంగా సాగుతున్నాయి. హోంశాఖ గణాంకాల ప్రకారం 2023తో పోలిస్తే 2024లో కొంతమేర తగ్గాయి. రాష్ట్రవ్యాప్తంగా 30, బెంగళూరులో 35శాతం తగ్గాయి. దేశవ్యాప్తంగా సుమారు లక్ష కోట్ల రూపాయలదాకా బెట్టింగ్ వ్యవహారాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. వేల కోట్ల రూపాయలు పోగొట్టుకున్న వారిలో అధికంగా పేద, మధ్యతరగతి వారే అధికంగా ఉన్నారు.

2021లోనే నిషేధం అయినా..

రాష్ట్రంలో నైపుణ్య ఆధారిత గేమ్‌లతోపాటు అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధిస్తూ కర్ణాటక ప్రభుత్వం 2021లో కర్ణాటక పోలీస్ చట్టానికి సవరణలు చేశారు. అయితే నైపుణ్య ఆధారిత ఆటలను నిషేధించడం రాజ్యాంగబద్ధంగా నియంత్రించడం సరికాదని కర్ణాటక హైకోర్టు 2022 ఫిబ్రవరిలో నిషేధాన్ని రద్దు చేసింది. తమిళనాడులోని చట్టం ప్రకారం 18ఏళ్ల లోపు వారికి ఆన్‌లైన్‌గేమ్‌లకు నిషేధం ఉంది. అయితే దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ గేమ్‌లకు యువత బలి అవుతున్నారు.



ఫిర్యాదు చేస్తే చర్యలు : దయానంద్, కమిషనర్



ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల మోసాలకు సంబంధించి ఇటీవల పలువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ అభిప్రాయపడ్డారు.



ఆరోగ్య చెలిమ..!

ప్రజల దాహం తీరుస్తున్న చెలిమ నీరు

శింగనమల చిన్న చెలిమలో నీరు తీసుకుంటున్న మహిళ

శింగనమల: నియోజకవర్గ కేంద్రం శింగనమల ఎస్సీ కాలనీవాసుల దాహార్తి తీరుస్తోంది చెలిమ. తరాలుగా చెలిమ నీరే తాగుతున్నామనీ, అనారోగ్య సమస్యలు తలెత్తట్లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. రోజూ చెలిమ నీటిని బిందెల్లో తెచ్చుకుని, తాగుతున్నారు. చెలిమ నీరు స్వచ్ఛంగా ఉంటోందని వారు చెబుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ సమీపంలో రుషింగమయ్య కొండ ఉంది. కొండపై అక్కదేవతల పెద్ద కొలను ఉంది. ఆ కొలనులో నిత్యం నీరు పుష్కలంగా ఉంటుంది. వేసవిలో కూడా నీరు ఉంటుంది. కొండ చుట్టూ 7 కొలను చెలిమలు ఉన్నాయి. పూర్వం నుంచి ఈ చెలిమల్లోని నీటిని ప్రజలు తాగుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ సమీపంలోని రేగలకుంట వద్ద చిన్న చెలిమ ఉంది. అందులోని నీటినే కాలనీకి చెందిన వెయ్యి కుటుంబాలవారు నేటికీ తాగుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, శింగనమల

పశువులకు సైతం



ముచ్చురామిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ఓ కుటుంబం

ధర్మవరం రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి, నేలకోట, బడన్నపల్లి ఎస్సీకాలనీ, ఏలుకుంట్ల పైకాలనీ తదితర గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ముచ్చురామిలో ట్యాంకర్‌కు రూ.1500 బాడుగలు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. పాడి పశువులకు కూడా నీరు లేకపోవడంతో వాటిని అమ్ముకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎండలు మరింత పెరిగితే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ధర్మవరం ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు.

సమస్త ప్రాణకోటికి జీవనాధారం నీరు. ఆయా ప్రాంతాల అభివృద్ధి అక్కడ లభించే నీటి వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రకృతి వరప్రసాదమైన నీటిని కొంతమంది ఇష్టానుసారం వృథా చేస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి కోసం ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రాణాధారమైన నీటి కోసం దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య పంచాయితీలు జరుగుతూనే ఉన్నాయి. దీన్ని బట్టి నీటి ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. దేశంలో అత్యంత దుర్భిక్ష ప్రాంతంగా వాసికెక్కిన ఉమ్మడి జిల్లాలో ఉన్న అరకొర జలవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. నేడు నిర్లక్ష్యం వహిస్తే రేపటి తరానికి శాపగ్రస్తమైన జీవితం తప్పదు. ఇప్పటికే వేసవి సమీపిస్తే చాలు ఉమ్మడి జిల్లాలో చాలా గ్రామాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. ప్రపంచ జల దినోత్సవం శనివారం జరుపుకుంటున్న సందర్భంలో ఉమ్మడి జిల్లా స్థితిగతులపై కథనం.

జలమే.. జయం..!

- నీరుంటేనే అభివృద్ధి
- విలువ తెలుసుకుని వాడుకోవాలి
- పొదుపును అలవర్చుకోవాలి
- భూగర్భ జలాన్ని రక్షించాలి
- ప్రజల్లో చైతన్యం పెంపొందించాలి
- ఇప్పటికే పల్లెల్లో తాగునీటికి కటకట

నేడు ప్రపంచ జల దినోత్సవం



తనకల్లు/ అనంతపురం న్యూటౌన్ మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అరకొర నీటి ప్రాజెక్టులే తప్ప భారీ ప్రాజెక్టులు ఏవీ లేవు. అందుకే 80శాతం వ్యవసాయం వర్షాధారంగా సాగుతుంది. వేసవి వస్తే చాలు వాగులు, వంకలు ఎండిపోయి, బోరు బావులు అడుగంటి తాగునీటికి కూడా కటకటలాడాల్సి వస్తోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపొందేలా అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వాలు చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. దీంతో తీవ్ర నీటి కరువు వేధిస్తోంది. కొన్ని చోట్ల వెయ్యి అడుగులు తవ్వినా నీటి చెమ్మ కనిపించని దుస్థితి ఉంది. భూగర్భ జల రక్షణ కోసం ఉమ్మడి జిల్లాలో 2005 నుంచి వాల్టా చట్టం అమలు చేస్తున్నా... పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జల సంరక్షణ కోసం జనజాగృతి వంటి స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా పంట-నీరు ప్రణాళిక కార్యక్రమాలను చేపట్టి, రైతులకు నీటి వాడకంపై అవగాహన కల్పిస్తున్నాయి.

నీటి ఎద్దడి రానివ్వం



జిల్లాకు నీటి ఎద్దడి రానివ్వకుండా తగిని చర్యలు చేపడుతున్నాం. గుంతకల్లు మండలంలోని ఒక పంచాయతీ, శింగనమల మండలంలోని మరో పంచాయతీలో తప్ప జిల్లాలో ఎక్కడ సమస్యలు లేవు. శింగనమల మండలంలో బోరు వేయడం ద్వారా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుంతకల్లు మండలంలో బోరు వేసిన తగిన నీటి లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నాం.

-సురేష్, ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అనంతపురం జిల్లా

నీటిని ఒడిసి పట్టాలి



జిల్లాలో నీటిని ఒడిసి పట్టుకోవాల్సిందే. ప్రతి ఐదెకరాలకు ఒక ఫాంపాండ్ తవ్వుకోవాలి. పడే వర్షంలో పదిశాతం మాత్రమే భూగర్భ జలాలుగా మారుతాయి. జిల్లా వ్యాప్తంగా 96 పిజో మీటర్లు ఏర్పాటు చేసి, భూగర్భజలాలను పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 10.17 మీటర్ల లోతులో నీరున్నాయి. మేనెలలో మరింత లోతుకు వెళ్లే ప్రమాదముంది. గత ఏడాది 17 మీటర్ల లోతులో నీరుండగా, ఈఏడాది మరింత లోతుకు వెళ్లే అవకాశముంది.

-మల్లికార్జునరావు, డిప్యూటీ డైరెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు, శ్రీసత్యసాయి జిల్లా

భవిష్యత్తుకు ప్రమాదం



జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒకరు నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే, భవిష్యత్ తరాలకు ప్రమాదమే. ఇప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా ఫాంపాండ్లు, ఇంకుడు గుంతలు, ట్రెంచ్‌ల నిర్మాణం, పండ్లతోటల పెంపకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు, అమృత్ సరోవర్ లాంటి కార్యక్రమాల ద్వారా సహజ వనరుల సంరక్షణకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లాలో వివిధ పథకాల ద్వారా ఈ ఏడాది 2.72 టీఎంసీల నీటిని భూమిలోకి ఇంకింపజేశాం. ప్రతి ఒకరు నీటిని పొదుపుగా వాడాలి.

-విజయప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటియజమాన్య సంస్థ

సహజ వనరులను సంరక్షించాలి



జిల్లాలో ఉపాధి పథకం, వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా నీటి సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు. సహజ వనరుల సంరక్షణద్వారానే భూగర్భజలాలను పెంపొందించవచ్చు. మా సంస్థ ద్వారా మొగిలిచెట్ల తండా వద్ద 210 ఎకరాల్లో అడవులను కాపాడటం ద్వారా నీటి సంరక్షణకు కృషి చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా సామాజిక కట్టుబాట్లను తీసుకు వచ్చి అడవుల పెంపకం చేపడితే భూగర్భజలాలు పెరుగుతాయి. నీటిని ఉమ్మడి వనరుగా ప్రకటించాలి. భూగర్భ జలాలు వాడుకుంటున్న ప్రతి ఒకరు నీటిని భూమిలోకి నీటిని ఇంకించేలా కార్యక్రమాలు చేపట్టాలి.

- బలరాం, సీఈఓ, జనజాగృతి సంస్థ

జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



అనంతపురం టౌన్: ప్రపంచ జలదినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం ఆదేశించారు. తొలుత గ్రామీణాభివృద్ధిశాఖామంత్రి పవన్‌కళ్యాణ్ కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలదినోత్సవం, పల్లెపండుగ నిర్వహణపై మంత్రి పలు ఆదేశాలిచ్చారు. అనంతరం కలెక్టరు జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తాను ఉరవకొండ నియోజకవర్గంలో జరిగే జిల్లా స్థాయి జలదినోత్సవంలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ప్రతి పంచాయతీలలోను 3నుంచి 5వరకు ఫారంపాండ్ పనులు మొదలు పెట్టాలన్నారు. జిల్లాలో 9వేల ఫారంపాండ్‌ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 6,864 మంజూరుచేశామన్నారు. జిల్లాలో మెటీరియల్ ఖర్చులకు రూ.186.41కోట్లు లక్ష్యం పెట్టుకోగా అంతకన్నా ఎక్కువగా ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్‌బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతున్న గ్రామాలు

అనంతపురం జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు వేసవి ప్రారంభంలోనే తాగునీటి కోసం అల్లాడిపోతున్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నట్లు అధికారులు నివేదికలు తయారు చేశారు. ఇక్కడ 66 వేలకు పైగా జనాభా ఉంది. జిల్లాలోని 31 మండలాల్లోని 130 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు అధికారులు నివేదిక తయారు చేశారు. ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దదని ఎదుర్కొనేందుకు రూ.5.87 అవసరం అవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



నీటి ఎద్దడి తలెత్తే పంచాయతీలు...

అనంతపురం రూరల్‌లో 16, బుక్కరాయసముద్రం మండలంలో 6 , శింగనమల 9, గార్లదిన్నె4, కంబదూరు 12, పుట్లూరు6, నార్పలలో 8, గుంతకల్లు6, గుత్తి 6, ఆత్మకూరు 6, కూడేరు 5, విడపనకల్లు 5, యల్లనూరు 8, కుందుర్పి 5, శెట్టూరు 5, బ్రహ్మసముద్రం 3, కళ్యాణదుర్గం 8, ఉరవకొండలో 4 పంచాయతీలకు సంబంధించి 130 గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నట్లు అధికారులు నివేదికలు పంపారు.

ప్రజలకు సమ్మె గుబులు...?

జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను సత్యసాయి, శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట లు తీరుస్తున్నాయి. అయితే ఇందులో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా సమ్మె చేపట్టే అవకాశం ఉండటం గుబులు రేపుతోంది. అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. కార్మికులు సమ్మె చేసినప్పుడు మాత్రం హడావుడి చేసే అధికారులు ఆనక పట్టించుకో వడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా గడిచిపోతే చాలని ఎదురుచూస్తున్నారు.



రైతులకు నీటివాడకంపై అవగాహన కార్యక్రమం



నీటి నిల్వ కోసం తనకల్లు వద్ద తవ్విన ఫాంపాండ్

షాక్ కొడుతోంది..!

జిల్లా విద్యుత్ శాఖలో

ఏఈఈల కొరత

- 30శాతం పోస్టులు ఖాళీ
- ఆయా స్థానాల్లో జూనియర్ ఇంజనీర్లే దిక్కు
- పని ఒత్తిడిలో సిబ్బంది.. సేవలపై ప్రభావం

- జిల్లా కేంద్రంలోని డి-4 విద్యుత్తు సెక్షన్‌కు ఏఈఈ లేక నెలలు గడుస్తోంది. ఈనేపథ్యంలో డి-1 సెక్షన్ ఏఈఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డి-5సెక్షన్ పరిస్థితి ఇలాగే ఉంది. స్థానికంగా ఏఈఈ లేకపోవడంతో ఆత్మకూరు మండలం ఏఈఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఉన్న విధులతోనే సతమతమవుతుంటే అదనపు బాధ్యతలు కేటాయించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- శింగనమల మండలానికి కొన్ని నెలలుగా ఏఈఈ లేరు. తాడిప్రతిలో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్‌కు శింగనమల ఏఈఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వజ్రకరూరుకు ఏఈఈ లేకపోవడంతో గుంతకల్లులో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. యాడికి మండలానికి తాడిపత్రిలోని డి-1సెక్షన్‌లో పనిచేసే జూనియర్ ఇంజనీర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇలా ఏఈఈలు లేకపోవడంతో జూనియర్ ఇంజనీర్లే జిల్లా విద్యుత్తు శాఖకు దిక్కుగా మారారు.



జిల్లా విద్యుత్తు శాఖ కార్యాలయం

అనంతపురంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు లేకపోవడంతో పాలన కుంటు పడింది. జిల్లా వ్యాప్తంగా 40శాతం వరకు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈఈల కొరత కారణంగా ఆయా కార్యాలయాలు, పక్క ప్రాంతాలు, సెక్షన్లలో పనిచేసే జూనియర్ ఇంజనీర్లే విద్యుత్ శాఖకు దిక్కుగా మారారు. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువశాతం ఏఈఈల కంటే జూనియర్ ఇంజనీర్లే విధులు నిర్వహిస్తున్నారు. ఆ ప్రభావం విద్యుత్ సేవలపై పడుతోంది.

సేవలపై ప్రభావం

క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈఈలు లేకపోవడంతో సంబంధిత కార్యాల యాల్లో పాలన అధ్వానంగా తయారైంది. ఇన్‌చార్జులుగా నియమితులైన వారు తమ సెక్షన్ల పనులు చూసుకునే సరికే రోజులు గడిచిపోతున్నాయి, ఈనేపథ్యంలో ఇన్‌చార్జులుగా ఉన్న కార్యాలయాలకు అప్పుడప్పుడూ వెళ్లి వస్తున్నారు. దీంతో ఆయా సెక్షన్లతో పాలన కుంటుపడుతోంది. ఆ ప్రభావం కాస్తా వినియోగదారులకు అందే సేవలపై పడుతోంది. జిల్లా వ్యాప్తంగా గృహ కనెక్షన్లు 6,17,598 ఉన్నాయి. కమర్షియల్ కనెక్షన్లు 72,061, ఇండస్ట్రీస్ 3,530, తాగునీటి కనెక్షన్లు, వీధి దీపాలకు సంబంధించి కనెక్షన్లు 12,803, వ్యవసాయ కనెక్షన్లు 1,84,542 కనెక్షన్లు ఇలా మొత్తం 8,90,534 కనెక్షలున్నాయి. వీటికి సంబంధించి ఏవైనా సమస్యలు వచ్చిన ఏఈఈలు వెళ్లాల్సిందే. వీటితో పాటు నూతన సర్వీసుల కోసం వినియోగదారులు, రైతులు కచ్చితంగా సంబంధిత కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే స్థానికంగా అధికారులు లేకపోవడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జూనియర్ ఇంజనీర్లే దిక్కు

జిల్లాలో ఏఈఈల కొరత కారణంగా ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 68 ఏఈఈ పోస్టులు ఉంటే అందులో 20 ఖాళీగా ఉన్నాయి. వీటిలో 12మంది జూనియర్ ఇంజనీర్లు ఇన్‌చార్జులుగా పనిచేస్తుండటం గమనార్హం. ఏఈఈ లేకపోవడంతో ఉన్నతాధికారులు చాల చోట్ల జూనియర్ ఇంజనీర్లకు అదనపు బాధ్యత లు అప్పగించి పనులు చేయించుకుంటున్నారు. వాస్తవానికి జూనియర్ ఇంజనీర్లు డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది. జూనియర్ ఇంజనీర్లు తమ విధులు నిర్వర్తిస్తూనే స్థానిక సెక్షన్ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వీరికే ఇన్‌చార్జ్ ఏఈఈ బాధ్య తలు అప్పగించారు. కొంత మంది ఏఈఈలు తాము పనిచేసే సెక్షన్‌తో పాటు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న సెక్షన్‌లోని వాటిని పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో రోజువారిగా ఉన్నతా ధికారులు నిర్వహించే టెలీకాన్ఫరెన్స్‌లు, ప్రజాప్రతినిధుల సమావేశాలు, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఇతరత్రవాటితో తలమునకలవు తున్నారు. ఒక్కొక్క ఏఈఈ 12వేల నుంచి 15వేల సర్వీసులను పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 45వేల నుంచి 50వేల సర్వీసులను పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

సమస్యలు తతెత్తకుండా చర్యలు



జిల్లాలో ఏఈఈల కొరతను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏఈఈల కొరత కారణంగా ఆయా స్థానాల్లో సమీపంలోని ఏఈఈలు, జూనియర్ ఇంజనీర్లకు బాధ్యతలు అప్పగించాం. ఇదే క్రమంలోనే వినియోగదారులు, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్తు శాఖ, అనంతపురం జిల్లా



జిల్లా కేంద్రంలోని డి-5 సెక్షన్ ఏఈఈ కార్యాలయం

అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం

జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్



అనంతపురం న్యూటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ పేర్కొన్నారు. జిల్లాలోని 94 రిజర్వ్ ఫారెస్ట్ (ఆర్ఎఫ్) బ్లాకులకు జియో ట్యాగింగ్ చేయించి, హద్దులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 88 బ్లాకులను పూర్తి చేశామన్నారు. అటవీస్థలాల్లోకి ఎవరూ అక్రమంగా ప్రవేశించకుండా చర్యలు చేపడతామంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: వన్యప్రాణుల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: వేసవిలో వన్యప్రాణులు దాహంతో జనారణ్యంలోకి వస్తుంటాయి. వాటిని సంరక్షించడంలో భాగంగా సాసర్ పిట్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతాం. జిల్లాలో 35 సాసర్ పిట్స్ ఉన్నాయి. సాసర్ పిట్స్ స్థానంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించి, అక్కడ నీరు నిలువ ఉండేలా చర్యలు చేపడతాం. వన్యప్రాణులకు.. అడవిలోనే తగిన తిండి లభ్యమయ్యేలా ఫలాలను ఇచ్చే మొక్కలను పెంచుతాం.

ప్రశ్న: నర్సరీల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: జిల్లాలో పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. నర్సరీల్లో 4.8 లక్షల మొక్కలు అందుబాటులోకి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం 3.8 లక్షల మొక్కలు అందుబాటులోకి వచ్చేలా విత్తనం సిద్ధం చేశాం. జూన్ నాటికి అన్నీ సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వన్యప్రాణుల నుంచి పంటలు నష్టపోతున్న రైతులను ఎలా ఆదుకుంటారు?

జవాబు: వన్యప్రాణుల నుంచి పంటలు నష్టపోతే సంబంధిత రైతుకు పరిహారం అందజేస్తాం. ఇప్పటి వరకు రూ.3 లక్షలు పరిహారం అందించాం. మరో రూ.1.5 లక్షలు చెల్లించాల్సి ఉంది. అర్హులైన వారికి త్వరలోనే పరిహారం అందిస్తాం.

ప్రశ్న: వేసవిలో అగ్ని నుంచి అడవులకు ఎలా రక్షిస్తారు?

జవాబు: జిల్లాలో అగ్ని నుంచి అడవులను కాపాడటం సవాల్‌గా మారింది. ఎన్ని జాగ్రత్తలు చేపట్టినా ఏదో ఒక ప్రాంతంలో అడవిలో అగ్గి పడతూనే ఉంది. వీటిని మానిటరింగ్ చేయడానికి వేసవిలో ప్రతి రేంజ్‌కు ప్రత్యేకంగా నలుగురు ఫైర్ వాచర్స్‌ను నియమించాం. వీరు గ్రామాల్లో తిరుగుతూ.. అడవిలోకి ఎవరు వెళ్తున్నారు, వారి వివరాలు నమోదు చేస్తున్నారు. అడవిలో ఎక్కడ అగ్గి పడినా సమాచారం ఇవ్వాలి. తద్వారా వెంటనే అదుపు చేసే అవకాశం ఉంటుంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఎంఎన్ రాయ్ (జయంతి)



ఎంఎన్ రాయ్‌గా పేరొందిన మానవేంద్రనాథ రాయ్ 1887 మార్చి 21న పశ్చిమబెంగాల్ రాష్ట్రం అర్బేలియా ప్రాంతంలో జన్మించారు. హేతువాది, మానవ వాది, రాజకీయ సిద్ధాంతకర్త, రచయిత. రష్యా తర్వాత ప్రపంచంలో మొదటిగా మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన వ్యక్తి రాయ్. మొట్టమొదటి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌కు మెక్సికో అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. మనదేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలనే భావనను ప్రతిపాదించిన తొలి భారతీయుడు. ఆంగ్లం, జర్మన్, ఫ్రెంచి, రష్యన్, స్పానిష్ తదితర 17 భాషలు ఆయనకు తెలుసు. 1954 జనవరి 25న కన్నుమూశారు.

సుమ కనకాల (పుట్టినరోజు)



ప్రజాదరణ పొందిన తెలుగు బుల్లితెర వ్యాఖ్యాత(యాంకర్ల)లో ఒకరైన సుమ కనకాల 1975 మార్చి 22న జన్మించారు. కేరళకు చెందిన ఆమె మాతృభాష తెలుగు కానప్పటికీ తెలుగులో అనర్గళంగా మాట్లాడగలరు. చక్కటి వ్యాఖ్యానం, చిరునవ్వు, సమయస్ఫూర్తితో ఈమె రంగంలో రాణిస్తున్నారు. తెలుగు, మళయాళంలతోపాటు హిందీ, ఆంగ్ల భాషలలోనూ మాట్లాడగలరు. టీవీ కార్యక్రమాలకే కాక ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. తోటి నటుడు రాజీవ్ కనకాలను పెళ్లి చేసుకున్నారు. 2010లో ఉత్తమ టీవీ వ్యాఖ్యాత, తదితర అవార్డులు అందుకున్నారు.

ఆర్‌సీబీతో జీఆర్‌బీ డెయిరీ 'టౌన్‌బస్' ఒప్పందం

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో బెంగళూరుకు చెందిన ఎఫ్ఎంసీజీ జీఆర్‌బీ డెయిరీ ఫుడ్స్‌లో ఒకటైన 'టౌన్‌బస్' బ్రాండ్‌తో రాయల్ చాలెంజర్స్ ఆఫ్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఒప్పందం కుదిరింది. క్రికెట్‌పై ఉన్న అభిమానంతో ఒప్పందం చేసుకున్నట్టు టౌన్‌బస్ మార్కెటింగ్ చీఫ్ అరుణ్‌కుమార్ తెలిపారు. నాణ్యమైన, వినియోగదారుల విశ్వాసాన్ని పొందే లాంటి తిను బండారాలు మా లక్ష్యమన్నారు. ఐపీఎల్ సీజన్‌లో ఆర్‌సీబీతో కలసి చేతులు కలిపే సందర్భం సంతోషంగా భావిస్తున్నామన్నారు.

డాక్యుమెంటరీ రూపంలో సీరియల్ కిల్లర్ ఉదంతం

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్రంలో 16మంది మహిళలను హత్యచేసి రెండు కేసులలో శిక్షకు గురైన సీరియల్ కిల్లర్ మహానంద నాయక్ జీవితం ఆధారంగా డాక్యుమెంటరీ రూపొందించబడింది. జగ్గర్‌నట్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ది దుప్పటా కిల్లర్ పేరిట నిర్మించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌ప్లాట్‌ఫాం డాక్యుబేలో వీక్షించే అవకాశం ఉంది. మహానందనాయక్ హంతకుడని తేలినా పలు కేసులలో సరైన సాక్ష్యాలు, ఇతరత్రా ఆధారాలు లేక సుదీర్ఘజాప్యం జరిగింది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన సంఘటన.

నకిలీ నోట్ల చెలామణి.. నలుగురి అరెస్ట్

రాయచూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆశాపూర్ రోడ్డులో ఒక ఇంట్లో నకిలీ నోట్లను కలిగి ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారం రోజులు కూడా తిరగక ముందే మరో ఇద్దరు పట్టుబడ్డారు. బుధవారం రాత్రి నగరంలోని ఒక హోటెల్ వద్ద దొంగ నోట్లు చలామణి చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరు రఘునాథ హళ్ళికి చెందిన రమేశ్ కాగా మరొకరు గబ్బూరుకు చెందిన మంజునాథ్‌గా గుర్తించారు. వీరిద్దరు శంశాలం దర్గా సమీపంలోని ఒక హోటెల్‌లో భోజనం చేసి బిల్లు చెల్లించేందుకు రూ.500 నోటు ఇవ్వగా దాన్ని నకిలీదిగా హోటెల్ యజమాని గుర్తించాడు. సమాచారం మార్కెట్ యార్డ్ పోలీసులకు ఇవ్వగా వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని మొత్తం 49,500 విలువ గల 500 రూపాయిల నకిలీ నోట్లన్ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మార్కెట్ యార్డ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

బొలెరోను ఢీ కొట్టిన ట్రాక్టర్

● మహిళాకూలీలకు గాయాలు



ప్రమాద స్థలంలో ట్రాక్టర్, బొలెరో

రాయచూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : దేవదుర్గ తాలూకా గబ్బూరు సమీపం మురాంపూర్ బస్ స్టేజ్ వద్ద శుక్రవారం మహిళ కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో మహిళలు తీవ్రంగా గాయపడగా వారిని చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సిరవార తాలూకా కల్లూరు నుంచి గబ్బూరుకు పొలం పనుల కోసం మహిళలు ట్రాక్టర్ పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటన స్థళాన్ని పరిశీలించిన గబ్బూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి హత్య

రాయచూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్ సమీపం నిర్జన ప్రదేశంలో వృద్ధుడిని శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పూడ్చి చంపారు. దాదాపు 70 ఏళ్ల వయస్సున్న వృద్ధుడిని చాకుతో పూడ్చి చంపినట్లు పోలీసులు గుర్తించారు. శవం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెస్ట్ పోలీసులు స్థలాన్ని పరిశీలించి శవాన్ని పోస్ట్‌మార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఎవ్వరన్నదాని పై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాల గురించి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వైభవంగా 'కావేరి హారతి'

- దసరాకు కేఆర్ఎస్‌లో నిర్వహించేందుకు తీర్మానం
- ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్



శ్యాంకి చెరువులో సందడి ఇలా...

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి వాడకంపై అవగాహన కల్పించడంతోపాటు రాష్ట్ర ప్రజల జీవనాడిగా ఉన్న కావేరి నదికి గౌరవం సమర్పించేలా జలమండలి ఆధ్వర్యంలో కావేరి హారతి నిర్వహించారు. గంగాహారతి తరహాలో నగరంలోని శ్యాంకి చెరువులో శుక్రవారం రాత్రి కార్యక్రమం వైభవంగా సాగింది. తొలుత కొడగు జిల్లా భాగమండలలోని తీర్థోద్భవ ప్రాంతంలో ఉదయం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ విశేషపూజలు నిర్వహించారు. అక్కడ నుంచి పవిత్ర జలాలను నగరానికి తెచ్చారు. బెంగళూరు నగరంలో నీటి ప్రాధాన్యత, ఆవశ్యకతను తెలిపేలా కావేరి హారతి కార్యక్రమం చేపట్టినట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. నీరు లేనిదే నాగరికత లేదన్నారు. నీటినుంచే ధర్మం సాధ్యమన్నారు. కరువు వచ్చినప్పుడు బావులు సైతం ఎండిపోతాయన్నారు. వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు చేపట్టామని, అలాగే ప్రజలు కూడా నీరు వృథా చేయరాదన్నారు. బెంగళూరు నగరానికి నీటి సమస్య రాకుండా కాపాడాలని కావేరిమాతను ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. కాగా కేఆర్ఎస్‌లో దసరా వేళ కావేరి హారతి నిర్వహించాలని తీర్మానించామని ఇందుకుగాను ఒక కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కావేరి హారతి వీక్షించేందుకు ప్రజలు తరలి వచ్చారు. శ్యాంకి చెరువును విద్యుద్దీపాలతో శోభాయమానం చేశారు.



గంగమ్మ తల్లికి విశేష పూజలు నిర్వహించుకుంటున్న డీసీఎం డీకే శివకుమార్

రాష్ట్రమంతటా సజావుగా పది పరీక్షలు



మల్లేశ్వరంలోని ప్రభుత్వ పాఠశాల పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులు

బెంగళూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పరీక్షలు సజావుగా సాగాయి. ఏప్రిల్ 4వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 2818 కేంద్రాల నుంచి 8.96 లక్షలమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజున ఫస్ట్‌లాంగ్వేజ్ పరీక్షలు జరిగాయి. కన్నడ, తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, ఉర్దూ, ఇంగ్లిష్ పరీక్షలు జరిగాయి. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1.15 వరకు పరీక్షలు కొనసాగాయి. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ఎండల ప్రభావం తీవ్రంగా ఉండడంతో వైద్యఆరోగ్యశాఖ ప్రతి కేంద్రంలోనూ సిబ్బందిని నియమించారు. ప్రతిచోటా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, తాగునీరు అందుబాటులో ఉంచారు. 15881 పాఠశాలలనుంచి 8,42,817మంది విద్యార్థులు, 38,091మంది సప్లిమెంటరీ, 15539మంది ప్రైవేట్ విద్యార్థులతో కలిపి 8,96,447మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 3,35,468మంది బాలురు కాగా 3,78,389 మంది బాలికలు, ఐదుగురు తృతీయలింగ విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది కంటే 26,479మంది విద్యార్థులు పెరిగారు. పరీక్షా కేంద్రాల ప్రాంతాలలో పోలీసు బందోబస్తు, 144వ సెక్షన్ అమలులో ఉంది. విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప తొలిరోజు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు గులాబీలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

విషాదంలోనూ పరీక్షలు...

కాగా కొప్పళ జిల్లాలో తల్లి మృతి చెందిన బాధలోనూ విద్యార్థి పరీక్షల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం కెసరహట్టి గ్రామానికి చెందిన అడివయ్యస్వామి అనే విద్యార్థి తల్లి విజయలక్ష్మి మృతి చెందారు. ఆమె బాత్రూంలో జారిపడి తలకు బలమైన గాయం కావడంతో చికిత్సలు పొందుతూ మృతి చెందారు. అయినా కుటుంబ సభ్యులు, బంధువులు అడివయ్యస్వామికి ధైర్యం చెప్పి పరీక్షలు రాయించారు.

నీటికోసం తహతహ...

- వేసవికి ముందే నీటికి కటకట
- తాలూకాలో పచ్చగడ్డి కొరత



ఓ కుంటలో దాహం తీర్చుకుంటున్న గొర్రెలు

బాగేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభానికి ముందే ఎండలు మండుతున్నాయి. వేసవినుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు, పశుపక్ష్యాదులు ఆహారం, నీటికోసం పరితపిస్తున్నాయి. బయలుసీమ ప్రాంతమైన బాగేపల్లి తాలూకాలో పచ్చగడ్డి కొరత ఏర్పడింది. దీంతో ఆవులను గొర్రెలను మేపేందుకు కొండగుట్టలు, అటవీ ప్రాంతాలకు వెళ్తున్నారు. సుదూరం వెళ్తే కొంత గడ్డి దొరికినా, చాలా చోట్ల నీటి కుంటలు అడుగంటడంతో నీటి కొరత వెంటాడుతోందని పశువుల కాపరులు వాపోతున్నారు. పచ్చగడ్డి తగ్గడంతో ఎండుగడ్డి, ఇతర దాణా అధికంగా కేటాయించాల్సి వస్తోందని అయినా సాధారణంతో పోలిస్తే పాల దిగుబడి కొంత తక్కువగా ఉందని పలువురు పాడిరైతులు అభిప్రాయపడుతున్నారు.



పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టి

ఉపాధి కింద ప్రత్యేక తొట్టెలు:

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామపంచాయతీల పరిధిలో కొన్ని చోట్ల పశువులకోసం నీటితొట్టెలను నిర్మించారు. మరికొన్ని చోట్ల నిర్మించాల్సి ఉంది. చాలాచోట్ల నీటి కొరత కారణంగా తొట్టెలకు నీరు నింపడం సవాల్‌గా మారిందని పంచాయతీ నిర్వాహకులు అంటున్నారు. మరోవైపు తాలూకావ్యాప్తంగా మేత తక్కువగా లభిస్తున్న నేపథ్యంలో పశువులకోసం అవసరమైన గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు. పశుసంవర్ధకశాఖ, రెవెన్యూశాఖ అధికారుల దృష్టికి తెచ్చినా స్పందన లేకపోవడంతో సరిహద్దులోని ఇతర ప్రాంతాలనుంచి మేత ను ఎక్కువరేటుకు కొనుగోలు చేస్తున్నారు. రైతు ప్రముఖుడు గూళూరు సుందరామిరెడ్డి మాట్లాడుతూ పరిస్థితి ఇలాగే కొనసాగితే నిర్వహణ భారం తట్టుకోలేక కసాయిఖానాలకు పంపాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి రాకమునుపే మేత కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులను, రైతులకు అండగా ఉంటాలని కోరారు.

పండ్ల రసాలకు డిమాండ్

ఎండలు అధికం కావడంతో దాహార్తి తీర్చుకోవడానికి ప్రజలు సాధారణ కంపెనీ కూల్ డ్రింక్స్‌కు బదులు కొబ్బరి బోండాలు, మజ్జిగ, నిమ్మరసం, చెరుకురసం, జీరా సోడా, పుచ్చకాయ, దోసకాయలు, ఇతర పండ్ల రసాలవైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజలలో ఆరోగ్యంపై ఆసక్తి పెరగడంతో పండ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి బోండాలు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు దుకాణదారులు అభిప్రాయపడ్డారు.

సర్జాపురలో రంజాన్ కిట్ల పంపిణీ

దొమ్మసంద్ర, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామంలో కస్తూరి కర్ణాటక జనపర వేదిక ఆధ్వర్యంలో రంజాన్‌ను పురస్కరించుకుని ఆహారకిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సర్జాపుర గ్రామపంచాయతీ సభ్యుడు డాక్టర్ ఎస్ మంజునాథ్‌సర్జా నేతృత్వంలో సుమారు 400మందికి కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ సర్జా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్‌మాసంలో ముస్లింలు ఎంతో కఠినమైన ఉపవాసదీక్ష చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్జాపుర గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్ రమేశ్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మమతా రమేశ్, సమాజసేవకుడు కామనహళ్ళి శ్రీనివాస్‌రెడ్డి, ఫైరోజ్, చిన్న మసీదు ముఖ్యుడు సాబీవుల్లా, కార్యదర్శి సయ్యద్ మహ్మద్, ముఖ్యులు మౌలా, బాబా, సాదిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న మంజునాథ్‌సర్జా తదితరులు

రూ.45 లక్షలతో మిగులు బడ్జెట్



మీడియాతో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బంగారపేట పురసభ ఆధ్వర్యంలో 2025-26 వార్షిక బడ్జెట్ రూ.45లక్షలు మిగులుగా ఉందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని పురసభ సభాంగణంలో ఏర్పాటైన సాధారణ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో రూ.22.5కోట్లతో యరగోళ్ నిర్మాణ పనులు రెండోదశ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. మూడు రోజులకోసారి తాగు నీరు విడుదల చేస్తామన్నారు. 120 బోర్ల మరమ్మత్తు పనులకు మోటార్ ప్యానెల్, బోర్డుల నిర్వహణకు టెండరు పిలుస్తామన్నారు. తద్వారా కోలారు, మాలూరు తాలూకాలకు నీరు సరఫరా చేస్తామన్నారు. కాగా భూ కబ్జాలు జరగలేదని వీటిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని పట్టించుకోరాదన్నారు. సమావేశంలో ముఖ్యాధికారి సత్యనారాయణ, పురసభ అధ్యక్షుడు ఎం గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడి

● ఎక్స్‌కవేటర్, 18 టిప్పర్ల స్వాధీనం

రాయచూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మాన్వి తాలూకా మద్లాపూర్ తుంగభద్ర నది తీర గ్రామంలో పెద్ద ఎత్తున ఇసుక రవాణ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు గురువారం తెల్లవారు జామున ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. భూగర్భ గనుల శాఖ అధికారి పుష్పలత నేతృత్వంలోని అధికారుల బృందం ఈ దాడిలో పాల్గొన్నట్లు తెలిపారు. దాడిలో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన ఇసుక డంప్‌తో పాటు ఇసుకను తవ్వేందుకు ఉపయోగిస్తున్న ఒక హిటాచి భారీ వాహనం రవాణ చేసేందుకు ఉపయోగిస్తున్న 18 టిప్పర్‌లను అధికారులు స్వాధీనం చేసుకుని మాన్వి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అధికారుల దాడి జరుగుతున్న వేళ టిప్పర్‌ల డ్రైవర్లు మొత్తం పరారు కాగా హిటాచి ఆపరేటర్‌లు సహితం అక్కడి నుంచి తప్పించుకున్నారు. ఈ వాహనాలన్ని ఎవరికి చెందినవో తెలుసుకునేందుకు ఆరా తీస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

నేడు రాష్ట్ర బంద్

బెంగళూరు, మార్చి21(ఆంధ్రజ్యోతి): మరాఠీలు ఇటీవల కన్నడిగులపై దాడిని నిరసిస్తూ కన్నడ సంఘాల ఐక్యకూటమి పిలుపు మేరకు శనివారం కర్ణాటక బంద్ జరగనుంది. ఇటీవల మరాఠీలు కేఎస్ ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై దాడితోపాటు సరిహద్దులో తరచూ వివాదాలకు కారణమవుతున్న వారిని కట్టడి చేయాలని బంద్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం 6 గంటలదాకా బంద్ కొనసాగుతుందని ఐక్యకూటమి అధ్యక్షులు వాటాళ్ నాగరాజ్ శుక్రవారం ప్రకటించారు. నిత్యావసరాలు, పండ్లు కూరగాయలు, వైద్య సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ బస్సు, మెట్రో రైళ్ల సంచారం ఉంటుందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు, వాహనాలు సంచరించనున్నాయి. బార్‌లు, ఎయిర్‌పోర్ట్ ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి. 65శాతం ఆటోలు సంచరించనున్నాయి. కాగా ఎటువంటి పరీక్షలకు అభ్యంతరం లేదు. మధ్యాహ్నం దాకా సినిమాహాళ్లు మూతపడనున్నాయి. 35శాతం ఆటోలు సంచరించవు. గూడ్స్ వాహనాలు, ఓలా, ఉబెర్ సేవలు తగ్గనున్నాయి. బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంఘం, లారీ డ్రైవర్‌ల సంఘం, హోటళ్ల సంఘం, కరవే సంఘాలు, రాజ్‌కుమార్ అభిమానసంఘాలు బంద్‌కు మద్దతు ఇచ్చాయి. అయితే కర్ణాటక రక్షణా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ వర్గం మాత్రం బంద్‌కు మద్దతు ఇవ్వలేదు. కాగా డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ కర్ణాటక బంద్‌కు ప్రభుత్వ మద్దతు లేదని ప్రకటించారు. బంద్ చేయాల్సిన అవసరం లేదన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



అవగాహనలో న్యాయాధికారులు తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం, విశ్వ వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో తాలూకా న్యాయ సేవల సమితి, న్యాయవాదుల సంఘం, పోలీసుశాఖ, స్త్రీ శిశుసంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించిన జాగృతిలో సివిల్ న్యాయాధికారి మొహ్మద్ రోషన్ ముఖ్యులుగా పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాలలో స్వావలంబన సాధిస్తున్నారని, అబల కాదు సబల అనేలా ముందుకు సాగుతున్నారని వక్తలు పేర్కొన్నారు. ప్రధాన సవిల్ న్యాయమూర్తి పూజా జె, న్యాయవాదులసంఘం తాలూకా అధ్యక్షుడు నారాయణస్వామి, కార్యదర్శి సీజీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాల దుష్పరిణామాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

చింతామణి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అబ్కారి అధికారి జిఎస్ పాటిల్ నేతృత్వంలో ప్రత్యేక జాగృతి కార్యక్రమం చేపట్టారు. భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్, చిక్కబళ్ళాపుర జిల్లా, నెహ్రూ యువజన కేంద్రం కోలారు-చిక్కబళ్లాపుర సంయుక్త ఆధ్వర్యంలో చింతామణి పట్టణంలోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలికాలంలో యువత దుర్వ్యసనాలకు లోనవుతున్నారని వాటి బారి నుంచి బయటపడేందుకు తమవంతుగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారి పాటిల్ తెలిపారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. చింతామణి అబ్కారి అధికారి రేణుకా, ప్రిన్సిపాల్ కుసుమ మంగళ, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సంఘటనా కమిషనర్ విశ్వనాథ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రోవర్ లీడర్ ప్రవీణ్, మహ్మద్‌పాషా, యువ సమితి సమీర్, వరుణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ దాడి కేసులో పదేళ్ల జైలుశిక్ష

దొమ్మసంద్ర, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యాసిడ్ దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, 10లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఆనేకల్ మూడో జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి బి సోమశేఖర్ తీర్పునిచ్చారు. 2019లో హెచ్ ఆనంద్‌మేటి అనే వ్యక్తిపై బసప్ప యాసిడ్ దాడి చేశారు. సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని చార్జ్‌షీట్ సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీ తారకనాథ్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాల విచారణ అనంతరం బసప్పపై ఆరోపణలు రుజువు అయ్యాయి. న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. బీఎంటీసీ జిగణి డిపోలో ఆనంద్‌మేటి మెకానిక్‌గా పనిచేసేవాడు. ఇతను బిజాపూర్ జిల్లా ముద్దేబిహాళ తాలూకా హబ్బిహాళ గ్రామానికి చెందినవాడు. ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి తిగళచౌడదేనహళ్ళి గ్రామంలో బసప్ప యమునప్ప, ఆనంద్‌మేటిలు ఒకే గ్రామానికి చెందినవారు. ఇద్దరిమధ్య తలెత్తిన మనస్తాపాల నేపథ్యంలో ఆనంద్‌మేటిపై యాసిడ్‌తో దాడి చేసినట్టు బసప్ప అంగీకరించాడు. ఎట్టకేలకు కేసులో నిందితుడికి శిక్ష పడింది.

మడుగులో పడి విద్యార్థి మృతి

రాయచూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేవదుర్గ తాలూకా కాకరగల్ గ్రామ సమీపంలోని మడుగులో విద్యార్థి దుర్మరణం పాలైయ్యాడు. శుక్రవారం ఈత కోసం వెళ్లిన విద్యార్థి మంజునాథ కాశినాథ(12) మడుగులో పడి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. ఉదయం బయటికి వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెతకడంతో చివరకు మడుగు సమీపంలో విద్యార్థి బట్టలు ఇతర వస్తువులు ఉండడాన్ని గుర్తించి మడుగులో పడి ఉన్నట్లు అనుమానించారు. దీంతో మడుగులోని నీటిని ఖాళీ చేయగా మృతదేహం బయటపడింది. విషయం తెలుసుకున్న గబ్బూరు పోలీసులు సంఘటన స్థళాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1597.11	1,582.20
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,217	765
నీటి నిల్వ (టీఎంసీలు)	18.02	5.63

పోలీసుల పేరుతో బంగారం దోపిడీ

● ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు ● సహకరించిన డ్రైవర్ అదుపులో..



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న పోలీసులు

బళ్లారి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బస్సులో బంగారు ఆభరణాలు దొంగిలించేందుకు ముగ్గురు దొంగలు పోలీసుల అవతారం ఎత్తారు. పోలీసులమని నమ్మించి సుమారు రూ. 65 లక్షల విలువైన బంగారం దొంగలించారు. ఇందులో బస్సుడ్రైవర్ పాత్ర కూడా ఉందని పోలీసులు గుర్తించారు. విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపిన వివరాల ప్రకారం... దావణగెరెలో ఉండే స్వర్ణఆభరణాల డిజెన్ కోసం విజయపురలో ఉండే ఒక బంగారు వ్యాపారి ఆభరణాలు పంపించాడు. బంగారు వ్యాపారి వాటిని డిజెన్ చేసి బస్సులో పంపేవారు. ఇది గమనించిన కొందరు దుండగులు పోలీసుల అవతారం ఎత్తారు. బస్సులో బంగారు వస్తుందన్న సమాచారం ఆ యువకులకు డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో దావణగెర నుంచి విజయపురకు వెల్లతున్న దుర్గాంబ బస్సును శివమొగ్గ వద్ద బుధవారం రాత్రి దుండగులు అడ్డగించారు. డ్రైవర్ వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. మేము పోలీసులం, నీవద్ద బంగారు ఉంది ఎక్కడ నుంచి తెస్తున్నావని దబాయించారు. పోలీసుల ముసుగులో ఉన్న వీరిని నిజంగా పోలీసులే అని డ్రైవర్ వద్ద ఉండే బంగారాన్ని వారికి ఇచ్చేశాడు. బస్సు అనుకున్న సమయానికి కాకుండా విజయపురకు గంట ఆలస్యంగా బయలు దేరింది. బంగారు షాపు యజమాని వచ్చి డ్రైవర్‌ను అడగగా దారిలో పోలీసులు వచ్చి బంగారం తీసుకుపోయారని తెలిపారు. ఇందుకు బంగారు ఆభరణాల వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయనగర జిల్లా పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో డ్రైవర్ దుండగులకు సహకరించినట్లు తేలింది. డ్రైవర్ ద్వారా నకలి పోలీసులను పట్టుకున్నారు. బస్సుడ్రైవర్ మంజునాథ్, మరొకరుల కృష్ణాలక్ష్మప్ప లంబాని, నిత్యానంద ముగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అపహరించిన రూ.65 లక్షల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.



అరెస్టయిన నిందితులు

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు ప్రారంభం



కంప్లిలో వేచివున్న విద్యార్థులు

కంప్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో మొదటి రోజునే 26 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. తాలుకాలో ఆరు సెంటర్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 1951 మంది విద్యార్థులకు గాను 1925 విద్యార్థులు హాజరయ్యారు. సెంటర్ 1 శ్యామాచంద్, శారద ఆంగ్ల మాధ్యమం, విజయనగరం ఆంగ్ల మాధ్యమ పాఠశాల, బాలికల కళాశాల, ఎమ్మిగనూరు పాఠశాలలు, సుగ్గినల్లి ప్రభుత్వ పాఠశాల, ఈ ఆరు సెంటర్లలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆరు సెంటర్లలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం



పరీక్షకు బయల్దేరుతున్న విద్యార్థులు

సిరుగుప్ప, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేందుకు 11 కేంద్రాలకు ఉచిత ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా మొత్తం 14 చోట్ల పరీక్ష కేంద్రాలు ఉన్నప్పటికీ సిరుగుప్ప, టెక్కలకోట ప్రాంతాలలో బస్సుల సౌకర్యం ఉన్నప్పటికీ ఆ చోట వదిలి మిగిలిన గ్రామీణ ప్రాంతాలకు డిపో మేనేజర్ తిరుమలేష సహకారంతో విద్యార్థులకు బస్సుసౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు.

20,297 మంది విద్యార్థులు హాజరు

విజయనగరం (హోస్పేట), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఎల్‌సి పరీక్షల్లో మొదటి రోజు జిల్లాకు చెందిన 20,297 మంది విద్యార్థులు ప్రథమ బాష కన్నడ సబ్జెక్టు పరీక్షకు హాజరయ్యారని డీడీపీఐ వెంకటేష్ రామచంద్రప్ప తెలిపారు. జిల్లాలో మొత్తం 71 పరీక్ష కేంద్రాలు వుండగా హగరి బొమ్మనహళ్లిలోని 12 కేంద్రాల్లో 3022 మంది విద్యార్థులు హాజరుకాగా 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హోస్పేటలో 20 కేంద్రాల్లో 5673 మంది హాజరుకాగా 138 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 9 కేంద్రాల్లో 2766 మంది హాజరు కాగా 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కూడ్లిగిలోని 17 కేంద్రాల్లో 4812 మంది విద్యార్థులు హాజరుకాగా 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హరప్పనహళ్లిలోని 13 సెంటర్లలో 4024 మంది విద్యార్థులు హాజరుకాగా 116 మంది గైర్హాజరయ్యారు.

శిశువులకు టీకా తప్పనిసరి

● జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప



ప్రత్యేక టీకా కార్యక్రమంలో వైద్య సిబ్బంది

బళ్లారి సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): టీకాలను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉందని, మీజిల్స్‌ను నివారించడానికి తొమ్మిది నెలల వయస్సు పూర్తయిన తర్వాత తప్పకుండా మీజిల్స్ రుబెల్లా టీకాలు వేయించాలని జిల్లాఆర్‌సీ హెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప అన్నారు. శుక్రవారం జిల్లా యంత్రాంగం,జిల్లాపంచాయతీ మార్గదర్శకత్వంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాక నిర్వహించిన ప్రత్యేక టీకా ప్రచారం తర్వాత నగరంలోని గుగ్గరహట్టి, కాకర్లతోట, కౌల్‌బజార్, ఆశ్రయ కాలనీలలో టీకా పనులను పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడారు. టీకాలతో పలు రకాల వ్యాదులను అరికట్టవచ్చన్నారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి మీజిల్స్ సోకిన దాదాపు 10రోజుల తర్వాత మీజిల్స్ లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయని అన్నారు. తట్టు సాధారుణంగా 2 నుండి 4రోజుల వరకు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కాశీప్రసాద్, డాక్టర్ గుప్తా, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దానప్పనవర్, ఫీల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాంతమ్మ, ప్రాథమిక ఆరోగ్య అధికారిని మంజుల, నాగలక్ష్మి, జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

కంప్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉచ్చంగిదుర్గలోని ఉచ్చంగి దుర్గమ్మ పడగట్టితోపిన హాలమ్మ దేవాలయాల్లో రెండు రోజుల హుండీ లెక్కింపులో మొత్తం 83,90,048 వసూలయ్యాయి. శుక్రవారం సాయంత్రం లెక్కింపు ముగిసింది. కొండపై వున్న గుడిలో రూ. 74,13,025 ఉచ్చంగిమ్మ పడగట్టి ఆలయంలో రూ. 5,75,108 అడవి హాలమ్మ ఆలయంలో రూ. 4,01,915 మొత్తం రూ. 83,90,048 ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అధికారులు మాట్లాడుతూ వచ్చిన డబ్బులతో ఆలయ అభివృద్ధి చేపట్టి, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

● వీఎస్కేయూ రిజిస్ట్రార్ రుద్రేశ్

బళ్లారిసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో చెట్లను నాటడం , పోషించడం కేవలం సామాజిక సంస్కర్తలు, పర్యావరణవేత్తలు పనికాదు. ప్రతి ఒక్కరూ ఇంట్లో మొక్కను నాటి పోషించాలి. డబ్బుతో ఆరోగ్యాన్ని కొనలేము. ఒక చెట్టును నాటండి అది మీ ఆరోగ్యానికి సహాయపడుతుంది. అని విజయనగరం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాయం రిజిస్ట్రార్ రుద్రేశ్ అన్నారు. నగరంలోని హానగల్లు కుమారవేశ్వర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గవియప్ప సర్కిల్ వద్ద ఉన్న విద్యావర్ధక సంఘం నిర్వహించిన గోగ్రీన్ వాకథాన్ ప్రారంబోత్సవంలో ఆయన మాట్లాడారు. మనం సంపాదించిన ఇల్లు, కారు, బంగ్లా శాశ్వతంగా ఉండాలంటే పర్యావరణం పచ్చగా ఉండాలన్నారు. విపరీతంగా పెరుగుతున్న ఎండలకు చెట్లే మేలు చేస్తాయన్నారు. ౹యర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ మనం చెట్లను కాపాడితే అవి మన ఆరోగ్యాన్ని కాపాడుతాయి. గో గ్రీన్ ఒక రోజుకే పరిమితం కూకూడదని మీ దైనందిన జీవితంలో దాన్ని చేర్చుకోవాలని ఆయన అన్నారు. సర్కిల్లో ఉన్న బసవవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వసి విద్యార్థులు వాక్‌థాన్‌ను ప్రారంభించారు. వాక్‌థాన్ నగరంలోని ప్రముఖ వీదుల గుండా పయనించి తిరిగి గవియప్ప సర్కిల్‌కు చేరుకుంది. ఈసందర్భంగా విద్యవర్ధక సంఘం కార్యదర్శి అరవిందుపాటిల్,జడేసిద్దన గౌడ, చంద్రశేఖర్, శ్రీశైలగౌడ, రాజేశ్,సిబ్బంది పాల్గొన్నారు.



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ రుద్రేశ్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ,మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యే శక్తి-బాల కార్మికులకు విముక్తి అనే నినాదంతో ఏడు రోజుల పాటు జిల్లాలో తిరుగుతున్న ప్రజా అవగాహన వాహనాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి సివిల్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె, అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్ శుక్రవారం నగరంలోని జిల్లా కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిపాలన, జిల్లా పంచాయతీ, జిల్లాన్యాయ సేవల ప్రాధికార సంస్థ, జిల్లా కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా బాల కార్మిక సంఘం కార్యాలయం మార్చి 21నుండి 27వరకు జిల్లాలోని 5తాలూకాలలోని వివిధ గ్రామాల్లోని షెడ్యూల్డ్ కుల,షెడ్యూల్డ్ తెగల కాలనీల్లో బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పిస్తామన్నారు. పిల్లలను పనికి పంపితే చర్యలు తప్పవన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ మాట్లాడుతూ.. బాల కార్మికుల నిర్మూలన సమాజ అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందన్నారు. బాలకార్మిక ప్రాజెక్టు జిల్లా ప్రాజెక్టు అదికారి మౌనేస్ మాట్లాడుతూ 14సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ఏదైనా రంగంలో నియమిస్తే 6నెలల నుండి 2సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ. 20వేలు నుండి 50వేలు వరకు జరిమానా విధించవచ్చన్నారు. ఇదే సమయంలో బాలకార్మిక నిర్మూలన బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కరపత్రాన్ని ప్రముఖులు విడుదల చేశారు. ఈసందర్భంగా జిల్లాకార్మిక శాఖ అధికారి సిద్దప్పఖైనూర్, జిల్లాబాలల రక్షణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



వీల్ చైర్ అందిస్తున్న ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి అధికారులు

కంప్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ క్షేత్ర గ్రామీణాభివృద్ధి యోజన బీసీ ట్రస్టు తరపున పరమేశ్వరుడు డి వీరేంద్ర హెగ్డే అధ్యక్షతన రామసాగర్ గ్రామంలో శుక్రవారం వీల్ ఛైర్లు పంపిణీ చేశారు. ఐదు మంది ప్రత్యేక ఎంపిక చేసి వారికి అనుగుణంగా సామగ్రిని వీల్ ఛైర్, యు షేప్ వాకర్, సింగిల్ హ్యాండ్ స్టిక్, వాటర్ బెడ్ మొదలైన వివిధ రకాల ఉపకరణాలు అందించారు. అనంతరం రోహితాక్ష లబ్దిదారులకు పంపిణీ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ కార్యక్రమాల గురించి సమాచారం అందించారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామసాగర గ్రామ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌కుమార్ వీఆర్వో అధ్యక్షులు మల్లికార్జున, తాలుకా వ్యవసాయ అధికారి హాలప్ప, మండల వ్యవసాయాధికారి నాలెడ్జ్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ లైన్ సర్వీస్ ప్రతినిధులు పరశురాం, రమేష్, శైలజ, అన్నపూర్ణ, వినోద్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

● కర్ణాటక హ్యూమన్ రైట్స్ కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న కమిటీ వ్యవస్థాపకుడు ఉరుకుంద రెడ్డి

బళ్లారిరూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కురుగోడు తాలుకా ఎర్రంగళి గ్రామంలో ఆర్ఎంపీ వైద్యులు అని చెప్పుకొని ప్రజలకు నాసిరకం వైద్యం అందిస్తున్న యోగానందపై తగిన చర్యలు తీసుకోవాలని కర్ణాటక హ్యూమన్ రైట్స్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉరుకుంద రెడ్డి డిమాండ్ చేశారు. యోగానంద అనే వ్యక్తి ఎలాంటి విద్యార్హత లేకుండా ఎలాంటి వైద్య పరిజ్ఞానం లేకుండా గ్రామంలో అనధికారికంగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తూ ఆస్పత్రిని ఎందరో పేదల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నా ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉప్పర మల్లప్ప సిద్దేష్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు

కంప్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో అంతర్భాగంగా తేనెటీగల పెంపకాన్ని రైతులు అనుసరిస్తే రైతులు లాభాల బాటలో కొనసాగవచ్చునని గంగావతి కృషి విద్యాలయ ప్రొఫెసర్ బద్రీప్రసాద్ అన్నారు. శుక్రవారం మాళవి జోనల్ ఫారెస్ట్ నర్సరీ ఆవరణలో మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులకు తేనెటీగల పెంపకం, మొక్కల సంరక్షణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ తాము ఈవో జి పరమేశప్ప మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఇచ్చిన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా మెరుగుపడుతారన్నారు.

బళ్లారిలో చిరుజల్లులు

బళ్లారిరూరల్/రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంతో పాటు సరిహద్దు గ్రామాల్లో శుక్రవారం చిరుజుల్లులు కురిశాయి. శుక్రవారం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా అరగంటపాటు కురిసిన వర్షానికి నగరం చల్లబడింది. మధ్యాహ్నం 3-30 గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి మేఘాలు నల్లబడి ఉరుములతో చిరుజల్లులు కురిశాయి. జిల్లాలో ఉష్ణోగ్రత 37సెల్సియస్ డిగ్రీలుగా నమోదైంది. ఈ తేలికపాటి వర్షంతో వాతావరణం కొద్దిగా చల్లబడింది. జిల్లాలో తొలకరి చిరుజల్లులు పడి ప్రజలకు వేడి నుండి కొంత ఉపశమనం కల్పించింది. ఉగాది సందర్భంగా వర్షం వల్ల కొత్తనీరు కలుస్తాయిని ప్రజల నమ్మకం.







నగరంలో వర్షం దృశ్యాలు

హోసూరు జోన్

మైనార్టీల హక్కులను పరిరక్షిస్తాం: ఎస్‌డీపీఐ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు షబీవుల్లా

హోసూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముస్లింల హక్కులను పరిరక్షించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకులు పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ కల్యాణమండపంలో ఇఫ్తార్ విందు సందర్భంగా ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు షబీవుల్లా అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్ అహ్మద్ స్వాగతోపన్యాసం చేశారు. జిల్లా కార్యదర్శి జావిద్ , జిల్లా కార్యదర్శి అహ్మద్, జిల్లా కోశాధికారి కలీం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇమ్రాన్ విమ్, జిల్లా అధ్యక్షురాలు ఫరిదాబేగం, తళి నియోజకవర్గ అధ్యక్షుడు సమీర్, హోసూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఇంతియాజ్, హోసూరు మున్సిపల్ అధ్యక్షుడు అబ్బాస్‌లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

హోసూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శూలగిరి సర్కిల్ పరిధిలోని పేరండపల్లి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్ వార్షికోత్సవంలో భాగంగా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ సరస్వతి అధ్యక్షత వహించారు. తమిళనాడు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా కార్యక్రమం నిర్వహించారు. క్రీడల పోటీలు, నృత్యాలు, తిరుక్కురళ్, సంగీత పోటీలు, చిత్రలేఖనం తదితర పోటీల్లో గెలుపొందిన తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



షీల్డులతో విద్యార్థులు



రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

రైతుల గ్రీవెన్స్‌లో 250 వినతులు

హోసూరు(కృష్ణగిరి), మార్చి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో రైతుల సమస్యలను స్వయంగా ఆలకించేందుకు ప్రతినెలా రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రైతులకోసం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 250 వినతులు అందాయి. కలెక్టర్ దినేశ్‌కుమార్ అధ్యక్షత వహించారు. గత నెలలో నిర్వహించిన రైతుల గ్రీవెన్స్‌లో 243 అర్జీలు రాగా 225ను పరిష్కరించారు. ప్రస్తుతం సమావేశంలో వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై చర్చించారు. అలాగే సేంద్రియ ఎరువులపై రైతులకు శిక్షణ అందించారు. అలాగే సిక్కిం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు అధ్యయనానికి తీసుకెళ్లాలని రైతులు కోరడంతో పరిశీలించనున్నట్టు అధికారులు తెలిపారు. రిసోర్స్ ల్యాండ్‌లో 1 కిలోమీటర్ల దూరంలో ఉన్న చప్పనిపట్టి, బైయూర్ గ్రామంలో ఏదైనా జాతీయబ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని విన్నవించారు. నీరు ప్రవహించే ప్రాంతాల్లో అవసరమైన చోట్ల చెక్‌డ్యామ్‌లు, ఇతర నిర్మాణాలు, వర్షాకాలంలో నీటి సేకరణకోసం ప్రాజెక్టులు పలు అంశాలను రైతులు ప్రస్తావించారు. అలాగే ఎన్నేకోల్ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు పరిహారం సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయాలలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ సాధన కురళ్, జిల్లా అటవీ సంరక్షణాదికారి బాగన్ జగదీశ్ సుధాకర్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు పచ్చయ్యప్పన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిజానికి నిత్యం గుర్తింపు

● వీఎస్కేయూలో కోర్సు ప్రారంభించిన వీసీ మునిరాజు

బళ్లారి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సాంకేతికత పెరిగినా జర్నలిజానికి సమాజంలో ఎప్పటికీ గుర్తింపు లభిస్తుందిని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మునిరాజు అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఎంఏ జర్నలిజం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.ఎస్ రుద్రేష్, ప్రత్యేక అతిథిగా హరిశంకర్ పాల్గొని మాట్లాడారు. రిజిస్ట్రార్ రుద్రేష్ మాట్లాడుతూ జర్నలిజం బాధ్యత కలిగిన వృత్తి అన్నారు. ఇందులో చేరే విద్యార్థులు జీవితంలో సమాజం కోసం బాగా పనిచేయాల్సి ఉంటుంది. అలాగే చదువుతున్న రోజుల్లోనే మంచి మంచి కథనాలు రాయడం, అలాగే ఇతర మాతృభాషతో పాటు ఇతర భాషలు పై కూడా పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. హరిశంకర్ జర్నలిజంలో మంచి, చెడులను విద్యార్థులకు వివరించారు. వీరితో పాటు జర్నలిజం , మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి రాకేష్, తదితరలు పాల్గొన్నారు. జర్నలిజం విభాగం అవసరం అయిన పరికరాలు, భవనం కోసం రూ. 5.5 కోట్లు నిధులు ఉన్నాయని మాస్‌కమ్యూనికేషన్, విడియో జర్నలిజం లాంటి ఎన్ని సాంకేతిక పరికరాలతో జర్నలిజం క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ మునిరాజు